నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శనివారం | 08 | జూన్ 2024
పేజీలు 8

### వివాదాలకు తావు లేకుండా..
# విమర్శలకు దూరంగా..!


జిల్లా కలెక్టర్ డాక్టర్. సృజన

**కర్నూలు, సూర్య ప్రతినిధి :** దేశ వ్యాప్తంగా ఎన్నికలు శాంతియుతంగా పూర్తయి ఎన్నికల నియమావళి కూడా ఎత్తివేయడంతో నూతన ప్రభుత్వాలు ఏర్పడేందుకు మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో రాయలసీమలోనే ఎలాంటి వివాదాలకు తావు లేకుండా విమర్శలకు దూరంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌లు ప్రజల అభినందన లు మిగతా 2లో


జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

### టీడీపీ గురిపెట్టిన అయిదుగురు ఐపిఎస్‌లు
# కర్నూలులో పని చేసిన వారే..!

● నాడు ప్రజల్లో మంచి అధికారులుగా గుర్తింపు

**(వైవి.కృష్ణారెడ్డి)**
రాష్ట్రంలోఅధికారం మారింది. గత అయిదేల్ల కాలంలో టిడిపి నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసి మానసికంగా, శారీరకంగా క్షోభ పెట్టారని ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ గురి పెట్టిన ఐపిఎస్ అధికారుల్లో అయిదుగురు కర్నూలు జిల్లాలో పని చేసిన వారు కావడం గమనార్హం. వీరిలో ముగ్గురు అధికారులు జిల్లా ఎస్పీలుగా ఒక అధికారి కర్నూలు అదనపు ఎస్పీ, విజిలెన్స్ ఎస్పీగా మరో అధికారి కర్నూలు డిఎస్పీగా విధులు నిర్వహించారు. వీరు పని చేసిన కాలంలో జిల్లాలో మంచి అధికారులుగా గుర్తింపు పొందినా గత అయిదేళ్ల కాలంలో వారు అధికార పార్టీ చెప్పిందే వేదం అన్నట్లుగా పని చేశారన్న ఆరోపణలు మూటగట్టుకున్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలపై ఫిర్యాదు వచ్చిన మరుక్షణం రంగంలోకి దిగి పలు రకాల ఇబ్బందులకు గురి చేశారని ఆ పార్టీ నాయకులు పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి యువనేత నారా లోకేష్ తమ పార్టీ మిగతా 2లో


పిఎస్ఆర్ ఆంజనేయులు


నడిగట్టు సంజయ్


కొల్లి రఘురామి రెడ్డి


తిరుమలేశ్వర్ రెడ్డి


అమ్మిరెడ్డి

# జీడీపీలో 0.7 టీఎంసీల నీరు

● నీటి సామర్థ్యం 4.5 టీఎంసీలు


ప్రాజెక్టులో ఉన్న నీరు గాజులదిన్నె ప్రాజెక్టుకు చేరిన 1100 క్యూసెక్కుల వరద నీరు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గాజులదిన్నె ప్రాజెక్టుకు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా 1100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 0.7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు తెలుపుతున్నారు. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు అయితే ప్రాజెక్టులో కేవలం 0.7 టీఎంసీ నీరు మాత్రమే ఉండటంతో ప్రాజెక్టు వెలవెల పోతుంది. ప్రాజెక్టు కింద 25వేల ఎకరాలు సాగు భూమి ఉంది. గత రెండేళ్లుగా జూన్ చివరి నాటికి ప్రాజెక్టులో వరద నీరు వచ్చి సంవృద్ధిగా చేరేది. ఈ ఏడాది జూన్ నెల వచ్చినప్పటికి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలో వర్షాలు కురియక పోవడంతో ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరలేదు. దీంతో ప్రాజెక్టు వెలవెల పోతుంది. ఈ ప్రాజెక్టు కింద డోన్, పత్తికొండ, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు నీరు సరఫరా అవుతుంది. ప్రాజెక్టులో వరద నీరు వచ్చి చేరితేనే ప్రాజెక్టు కింద ఆయకట్టు భూములు పంట సాగుతో కళకళలాడుతాయి. వర్షం కోసం రైతులు ఆశాశం వైపు ఎదురు చూస్తున్నారు.

# తుగ్గలిలో భారీ వర్షం


కొట్టుకోపోయిన రహదారి
2లో

# భారీ వర్షం..రోడ్డెక్కి పారుతున్న నీరు


రోడ్డుపై ఎక్కి పారుతున్న వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
6లో

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** జిల్లాలో గురువారం రాత్రి నాలుగు మండలాల్లో అత్యధికంగా వర్షం కురిసింది. 10మండలాల్లో అత్యల్పంగా వర్షపాతం నమోదైంది. వాటిలో అత్యధికంగా హాలహర్వి 55.4ఎంఎం వర్షపాతం నమోదు కాగా ఓర్వకల్లు 43.0ఎంఎం, హోళగుంద 42.4ఎంఎం, కర్నూలు అర్బన్ 20.2ఎంఎం వర్షపాతం నమోదైంది. అలాగే అత్యల్పంగా నందవరం 13.4ఎంఎం, పెద్దకడుబూరు 10.8ఎంఎం, కౌతాళం 8.4ఎంఎం, ఆలూరు, గోనెగండ్ల 6.4ఎంఎం, కల్లూరు 4.0 ఎంఎం,ఆస్పరి, మద్దికెర 3.6ఎంఎం, మంత్రాలయం 3.4 . ఎంఎం,కోసిగి 2.0ఎంఎం వర్షపాతం నమోదు కాగా ఆదోని మండలం కేవలం చిరుజల్లులు మాత్రమే కురిశాయి.

# నాలుగు మండలాల్లో భారీ వర్షం


కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం చెరువు వద్ద దృశ్యం
2లో

సూర్య

శనివారం | 08 | జూన్ 2024

టిడిపి గురి పెట్టిన అయిదుగురు ఐపిఎస్‌లు

# కర్నూలులో పని చేసిన వారే..!

(మొదటి పేజీ తరువాయి)

నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రశ్నే లేదని ప్రతి ఒక్కరికి తగిన జవాబు ఇస్తామని, వారి పేర్లు రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నానని హెచ్చరించారు. టిడిపి గురి పెట్టిన ఐపిఎస్ అధికారుల్లో పి. సీతారామాంజనేయులు జిల్లా ఎస్పీగా 2000–2002 మధ్య కాలంలో పని చేశారు. అపుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నారు. ఆ కాలంలో జిల్లాలో ఫ్యాక్షన్ కార్యాకలాపాలను తుద ముట్టించేందుకు పలువురు ఫ్యాక్షన్ నాయకుల వద్ద కీలకంగా పని చేస్తున్న 22 మంది ప్రధాన అనుచరులను ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. సుమారు 18 నెలల కాలంలో ఈ ఎన్‌కౌంటర్లు చేసిన పిఎస్ఆర్ ఆంజనేయులు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఆయన కారణంగా జిల్లాలో ఫ్యాక్షన్ దాదాపు కనుమరుగైంది. దీంతో శాంతి కోరుకున్న ప్రజలకు ఆయన ఒక మంచి అధికారిగా గుర్తుండిపోయారు. నాడు ఎన్‌కౌంటర్ ఆంజయేయులుగా పేరు పొందిన పిఎస్ఆర్ ఆంజనేయులు బదిలీ అయిన వెంటనే ఆయన స్థానంలో నడిగట్టు సంజయ్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వచ్చిన తరువాత ఫ్యాక్షన్ కార్యకలాపాలపై ఉక్కు పాదం సడలకుండా జాగ్రత్త పడుతూనే నక్సల్ కార్యకలాపాలపై దృష్టి సారించారు. ఆయన 2002లో బాధ్యతలు చేపిట్టిన సమయంలో నల్లమలలో నక్సల్ కార్యకలాపాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. గాజులపల్లె రైల్వే స్టేషన్, ఆత్మకూరులో సినిమా హాల్‌లో పేలుడు వంటి దుర్ఘటనలకు నక్సలైట్లు పాల్పడ్డారు. ప్రధానంగా ఆత్మకూరులోని సినిమా హాల్‌లో నక్సలైట్లు బాంబు పేల్చిన మరునాడు అర్ధరాత్రి కొందరు అనుమానితులు ఆత్మకూరులో తిరుగుతున్నారన్న సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇదే సమయంలో ఒక బైక్‌పై ముగ్గురు యువకులు పోలీసులను తప్పించుకొని వేగంగా వెళ్తున్న సమయంలో సంజయ్ ఒక కానిస్టేబుల్ బైక్‌పై వెనుక కూర్చొని ఆ యువకులను వెంబడిస్తూ గాలిలో కాల్పులు జరిపారు. ఆ తరువాత ప్యాపిలి పట్టణంలో గణేష్ నిమజ్జనం సందర్భంలో కూడా మత కలహాల కారణంగా జరిగిన అల్లర్లు అదుపులోకి రాకపోవడంతో సంజయ్ స్వయంగా కాల్పులు జరిపిన సంఘటన నేటికీ ప్రజలు గుర్తుంచుకున్నారు. వీరిద్దరు అధికారులు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో పని చేయడం విశేషం. ఆయన స్వేచ్చ ఇచ్చిన కారణంగానే వారు ఫ్యాక్షన్, నక్సల్ కార్యకలాపాలను అదుపు చేసేందుకు తీవ్రంగా కృషి చేశారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇక కొల్లి రఘురామిరెడ్డి 2014 ఎన్నికల సమయంలో కర్నూలు ఎస్పీగా పని చేశారు. ఆయన సమైక్యాంధ్ర సమయంలో జరిగిన అల్లర్లలో స్వయంగా వీధిలోకి వచ్చి లాఠీ చార్జి చేసిన ఘటన ప్రజలందరికీ తెలుసు. ఒక వైపు ప్రజల మనోభావాలు గౌరవిస్తూనే శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఆయన పని చేశారు. ఇక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నుంచి ఆయన వెఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారన్న విమర్శలను కొల్లి రఘురామిరెడ్డి ఎదుర్కొన్నారు. టిడిపి అభ్యర్థుల వెంట ప్రత్యేకంగా షాడో పార్టీలను పెట్టి వారిపై నిరంతర నిఘా పెట్టారని నాడు వార్తలు వచ్చాయి. ఆయనపై టిడిపి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. ఆయన ఎస్పీగా ఎన్నికలను పూర్తి చేశారు. ఆ తరువాత టిడిపి అధికారంలో రావడం మరో జిల్లాకు ఎస్పీగా బదిలీ చేయడం జరిగింది. ఇక తాజా ఎన్నికల సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక కార్యకర్తలా పని చేస్తున్నారన్న టిడిపి ఆరోపణల మేరకు ఎన్నికల కమిషన్ విచారణ నిర్వహించి ఎన్నికలకు దూరంగా ఉంచి మరో ఐపిఎస్ అధికారి అమ్మిరెడ్డి కూడా కర్నూలు డిఎస్పీగా 2007–08 మధ్య కాలంలో విధులు నిర్వహించారు. ఆయన హయాంలో కర్నూలు ప్రాంతంలో మట్కా, నాటు సారా కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆగ్రహానికి గురైన ఐపిఎస్ అధికారి తిరుమలేశ్వర రెడ్డి సైతం కర్నూలులో పని చేసిన వారే. ఆయన 2013–14 మధ్య కాలంలో జిల్లా అదనపు ఎస్పీగా పని చేశారు. ఆ తరువాత 2021–22 మధ్య కాలంలో విజిలెన్స్ ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా ఉన్న సందర్భంలో ఆయన కూడా టిడిపి అభ్యర్థులకు వ్యతిరేకంగా పని చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నాడు వైసిపి అభ్యర్థులు ఫిర్యాదు చేస్తే చాలు టిడిపి నాయకులపై కఠిన చర్యలు తీసుకున్నారని ఇప్పటికీ ఆ పార్టీ నాయకులు గుర్తు చేసుకుంటున్నారు. విజిలెన్స్ ఎస్పీగా ఆయన పని చేసిన కాలంలో ఎక్కడా వివాదాస్పదం కాకుండా జాగ్రత్తగా పని చేశారని పోలీసులు వెల్లడిస్తున్నారు. దీని కారణంగా సామాన్య ప్రజలకు ఆయన విజిలెన్స్ అధికారిగా పని చేశారన్న విషయం తెలియదని పేర్కొంటున్నారు. మొత్తం మీద తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా చేసుకొని గురి పెట్టిన ఐపిఎస్ అధికారుల్లో అయిదుగురు కర్నూలు జిల్లాలో పని చేసిన విషయం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

# నాలుగు మండలాల్లో భారీ వర్షం









## నారా లోకేష్‌ను కలిసిన భూమా జగత్ విఖ్యాత్ భార్గవ్ రాములు

**ఆళ్లగడ్డ,మేజర్‌న్యూస్ :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను శుక్రవారం ఆళ్లగడ్డ తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్,భార్గవ్ రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ అత్యధిక మెజార్టీ సీట్లు దక్కించుకొని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నందుకుగాను ,మంగళగిరిలో అత్యధిక మెజార్టీతో నారా లోకేష్ గెలిచినందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.





## వివాదాలకు తావు లేకుండా.. విమర్శలకు దూరంగా..!

(మొదటి పేజీ తరువాయి)

అందుకుంటున్నారు. వారిద్దరు సమన్వయంతో వ్యవహరిస్తూ ఎక్కడా ఎలాంటి చిన్నపాటి ఘటనలకు ఆస్కారం లేకుండా ఎన్నికల ప్రక్రియను ముగించారు. రాయలసీమలోని ఇతర జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులపై ఏదో ఒక రకమైన విమర్శలు, ఆరోపణలు వచ్చినా కర్నూలు ఎన్నికల అధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌లపై ఏ ఒక్క రాజకీయ పార్టీ కార్యకర్త, నాయకుడు లేదంటే సామాన్య ప్రజలు సైతం ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం విశేషం. అంతేగాకుండా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సైతం వారు శరవేగంగా పరిష్కరించారని అధికారుల ద్వారా తెలుస్తోంది. కర్నూలు జిల్లా ఎన్నికల అధికారిగానే కాకుండా కర్నూలు లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన సృజన ఎన్నికల షెడ్యూలు విడుదలై ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ప్రత్యేక శ్రద్ధతో పని చేశారని జిల్లా అధికారులు, ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఆమె ఏ రాజకీయ పార్టీ ఒత్తిళ్లకు కూడా తలొగ్గకుండా ఎన్నికల నిబంధనలు తూచ తప్పకుండా అమలు చేశారని వారు కొనియాడుతున్నారు. ఎక్కడైనా కింది స్థాయి అధికారులపై స్థానిక రాజకీయ నాయకుల నుంచి ఫిర్యాదు వస్తే తక్షణం విచారించి తగిన చర్యలు తీసుకున్నారని సమాచారం. అయితే చిన్న చిన్న విమర్శలు, ఆరోపణలు మాత్రం వచ్చాయని చెప్పుకోదగినవేమీ లేవని వారంటున్నారు. వీటిని కూడా ఆమె నిర్లక్ష్యం చేయకుండా తగిన చర్యలతో వివాదాస్పదం కాకుండా చూసుకున్నారని పేర్కొంటున్నారు. ఇక ఎస్పీగా విధులు నిర్వహించిన కృష్ణకాంత్ సైతం ఎన్నికల నిబంధనల అమలులో ఎక్కడా రాజీ పడకపోవడం గమనార్హం. ఆయనపై కూడా ఒక్క విమర్శ కాని, ఆరోపణ కాని లేకుండా ఎన్నికల నిబంధనల మేరకు పని చేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికలు అంటేనే ఏదో ఒక రాజకీయ పార్టీ విమర్శలు, ఆరోపణలు చేస్తుందని అయితే కర్నూలు జిల్లాలో అలాంటి వాటికి అవకాశం లేకుండా ఆయన విధులు నిర్వహించారని పేర్కొంటున్నారు. ఆయనతో పాటు జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్‌లో కూడా పక్షపాతంగా పోలీసులు విధులు నిర్వహించకుండా జాగ్రత్త పడ్డారని ప్రజలు అభినందిస్తున్నారు. ఇద్దరు అధికారుల మధ్య సరైన సమన్వయం ఉంటేనే ఇది సాధ్యమవుతుందని అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు వెల్లడిస్తున్నారు. ఇద్దరు అధికారులు ప్రజలు గుర్తుంచుకుంటారని భవిష్యత్తులో కూడా ఇలాగే ఒత్తిళ్లకు తలొంచకుండా ప్రజల కోసం నిష్పక్షపాతంగా పని చేయాలని కోరుతున్నారు.

# తుగ్గలిలో భారీ వర్షం

– వర్షానికి కొట్టుకోపోయిన రహదారి – ఇబ్బందుల్లో ప్రయాణీకులు



**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన తుగ్గలిలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో తుగ్గలి చెరువుకు వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో చెరువు కట్ట సమీపంలో ఉన్న తుగ్గలి–ఎద్దులదొడ్డి రహదారి వర్షం నీటికి కొట్టుకపోయింది. దీంతో ఆ రోడ్డు నుంచి వెళ్లే ప్రయాణీకులు 20కిలోమీటర్ల దూరంలో నుంచి పత్తికొండ మీదుగా ఆ గ్రామాలకు వెళ్తున్నారు. రెండేళ్ల తర్వాత వర్షం పడిందన్నారు. దాదాప తుగ్గలి చెరువుకు సగం వరదనీరు చేరింది. దీంతోఈ సంవత్సరం చెరువు కింద మాగాని పంట పండించుకోవచ్చని రైతులలో ఆశ పుట్టుకొస్తుంది. రహదారి దెబ్బతిన్న విషయాన్ని తెలుసుకున్న రోడ్లు, భవనాల శాఖ మండల ఇంజనీర్ లక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వర్షం నిలిచిన వెంటనే మరమ్మతులు చేపడతామని ఆమె తెలిపారు. మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రశేఖర్ వరద ఉధృతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# రంగుల ఆకాశంతో కనువిందు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గోనెగండ్లలో శుక్రవారం సాయంత్రం సమయంలో సప్త వర్ణాలతో అందమైన సందర ఆకాశం అనువిందు చేసింది. ఈ సుందర దృశ్యాలను గ్రామస్థులు చూసి కనువిందు చేసుకున్నారు.



గోనెగండ్లలో శుక్రవారం సాయంత్రం అందమైన రంగుల్లో ఆకాశం

# అఖండ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యేకు సన్మానం

**కౌతాళం, మేజర్‌న్యూస్:** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మంత్రాలయం వైఎస్సార్సీపీ పార్టీ తరపున ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలుపొందిన వై.బాలనాగిరెడ్డిని శుక్రవారం వైసీపీ నాయకులు ఘనంగా శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా కౌతాళం వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు దాట్ల కృష్ణంరాజు, గురు రాఘవేంద్రరెడ్డి, గణపతిరాజు, యువ నాయకుడు సుబ్బరాజు, దాట్ల యూత్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సారథ్యంలో మంత్రాలయం నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. ముచ్చటగా నాలుగోసారి ప్రజలు ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

# భాష్యం, నారాయణ, కేశవరెడ్డి విద్యాసంస్థలపై చర్యలేవీ


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** భాష్యం, నారాయణ కేశవరెడ్డి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘాలైన ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని నారాయణ, భాష్యం పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బెల్టులు అమ్ముతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సోమన్న, నాగార్జున, రమణలు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ఆగడాలు రోజురోజుకు అధికమయ్యాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు. ఆయా కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వెంటనే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అశోక్, దామోదర్, హనుమంతు, కిరణ్, అభి, మహీంద్ర, అఖిల్, ఆనంద్, పురుషోత్తం, నరేంద్ర, సాయి పాల్గొన్నారు.

## కర్నూలు ఎంపికి
# కేంద్రమంత్రి పదవి కేటాయించాలి

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** సామాజిక వర్గాల సమీకరణలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు కేంద్ర మంత్రి పదవి కేటాయించఅలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాయలసీమ రవికుమార్, మాదాసి కురువ రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో వారు విలేఖరులతో మాట్లాడారు. కర్నూలు జిల్లాలో అణగారిన సామాజిక వర్గమైన కురువలను గుర్తించి కర్నూలు ఎంపీ స్థానాన్ని కేటాయించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు కురువల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జిల్లాలోని కురువలు బస్తిపాటి నాగరాజుకు కర్నూలు ఎంపీగా గెలిపించుకున్నారన్నారు. కావున ఆయనకు కేంద్ర మంత్రిపదవి కేటాయిస్తే కురువలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, గోవిందు, క్రిష్ణయ్య, పరమేష్, మల్లేష్, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కర్నూలు ఎంపిని కలిసిన
# సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** కర్నూలు ఎంపీగా ఎన్నికైన బస్తిపాటి నాగరాజును శుక్రవారం సమగ్ర శిక్ష కర్నూలు జేఏసీ నాయకులు కలిశారు. అధ్యక్షుడు చంద్రశేఖర్‌రాజు, రాజారావు, మధుమోహన్‌లు ఎంపికి పూలబోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. కర్నూలు ఎంపీ కూడా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.


పాఠశాల యాజమాన్యంతో వాదోపవాదాలు చేస్తున్న విద్యాధికారి

# మౌంట్‌కార్మెల్ పాఠశాల అక్రమాలు అరికట్టండి

**కోసిగి, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన కోసిగిలో ఉన్న మౌంట్‌కార్మెల్ పాఠశాల అక్రమాలను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈరేష్ అన్నారు. శుక్రవారం మౌంట్‌కార్మెల్ పాఠశాల యాజమాన్యం అక్రమంగా అడ్మిషన్లు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఎల్‌కేజీ విద్యార్థుల నుండి 2వేల నుండి 10వేల రూపాయల వరకు వసూలు చేయడం జరుగుతుందన్నారు. పాఠశాల తరగతులు ప్రారంభం కాకముందే ఈ అక్రమ వసూలు చేస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. ఈవిషయంపై విద్యాధికారి నాగేశప్ప తెలపడంతో ఆయన పాఠశాలను తనిఖీచేశారు. అయినా కూడా పాఠశాల యాజమాన్యం ఆయన ఎదురుగానే అడ్మిషన్లు ప్రారంభించడంతో యాజమాన్యం అహంకారానికి నిదర్శనమని చెప్పవచ్చు. చదువుపేరుతో అక్రమ వసూలు చేస్తున్న పాఠశాలపై కఠినచర్యలు తీసుకోవాలని విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈవిషయాన్ని విద్యాధికారి జిల్లా అధికారులు దృష్టికీసుకెళ్ళి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, గురుస్వామి, నరసింహులు, ఆనంద్ పాల్గొన్నారు.

## ఎన్‌డీయే కూటమి అఖండ మెజార్టీతో గెలుపొందడం పట్ల
# ప్రత్యేక పూజలు
## – 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

**కౌతాళం, మేజర్‌న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌డీయే కూటమి అఖండ మెజార్టీతో సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందడం పట్ల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలకేంద్రమైన కౌతాళంలోని ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌నాయుడు, చెన్నబసప్ప, వెంకటపతిరాజు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడి సంచలన విజయం కోసం పోరాడిన ప్రతి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. 101 టెంకాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడికి మంచి ఆయుష్షు, ఆరోగ్యం ప్రసాదించాలని భగవంతుడిని కోరామన్నారు. ప్రజలకు మెరుగైన సుభిక్ష సంక్షేమ అభివృద్ధి అందిస్తామని, మోసపోయిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అందిస్తూ కుంటుపడిన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నారా చంద్రబాబునాయుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలకంఠరెడ్డి, జేఎస్‌పీ రామంజిని, మారెప్ప, కరిబసన్నగౌడ్, మూకన్న, సిద్ధయ్య, సోమన్న, రహిమాన్ పాల్గొన్నారు.


ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక ఫాతేహాలో పాల్గొన్న టీడీపీ నాయకులు

# క్రైమ్ స్పాట్

## గంజాయి కాల్చివేత

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్:** నంద్యాల జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పట్టుబడిన గంజాయిని శుక్రవారం పోలీసులు కాల్చివేశారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు సబ్‌డివిజ న్‌లలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పట్టుబడ్డ 32 కేజీల గంజాయిని విజయ డెయిరీ సమీపంలోని ఖాళీ సమీపంలో ధ్వంసం చేసినట్లుగా డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జయరాములు తెలిపారు. ధ్వంసం చేసిన గంజాయి విలువ సుమారు రూ.4.70లక్షలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామనాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


గంజాయిని కాల్చివేస్తున్న దృశ్యం

## మతిస్థిమితం లేని మహిళను అప్పగించిన ఎస్.ఐ

**అవుకు, మేజర్‌న్యూస్ :** అవుకు మండలం శివవరం గ్రామంలో మతిస్థిమితం లేని మహిళ తిరుగుతుండగా గ్రామస్థులైన తలారి లక్ష్మిదేవి, మారం నాగేశ్వరమ్మలు గమనించి అంగన్‌వాడి కార్యకర్త బి. సరోజకు విషయం తెలియజేయగా ఆమె గ్రామ మహిళా పోలీసు నీలిమకు పంచాయితీ సెక్రెటరీ మున్నీరా గారికి తెలుపగా వారు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.వి శివమ్మకు తెలిపి అందరూ కలిసి ఆ మహిళ గురించి ఎస్.హెచ్.ఓ అయిన కిరణ్ బాబుకు తెలియజేయగా ఎస్.ఐ కర్నూలు తాలుకా పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసును తెలుసుకొని వారి కుటుంబ సభ్యుల వివరాల గురించి తెలుసుకొని వారిని పిలిపించి ఆమెను వారి కుటుంబ సభ్యులు సలిమాబి, సోహెల్, ముజమిల్‌కు అప్పగించడం జరిగింది.

## టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు
# దరఖాస్తుల ఆహ్వానం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** భారత యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ-2023 సంవత్సరానికి సంబంధించి టెన్జింగ్ నార్గే అడ్వెంచర్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్కూరు సీఈవో పి.వి.రమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత మూడేళ్లలో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారి నుంచి ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందించడంతోపాటు రూ.15లక్షల నగదు బహుమతి అందజేస్తామన్నారు. కావున ఈ మూడేళ్లలో సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## ఎంపీ, ఎమ్మెల్యే గెలుపుకు కృషి చేసిన తాతిరెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల ఎమ్మెల్యేగా ఫరూక్‌ను, ఎంపీగా బైరెడ్డి శబరి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసి...మండు టెండలను కూడా లెక్కచేయకుండా ప్రచారాలలో అత్యధిక మెజారిటీతో గెలిపించి అందరికి మనోధైర్యాన్నిచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డిని దివ్యాంగుల రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపకులు అధ్యక్షులు మస్తాన్‌వలి ఘనంగా సత్కరించారు. శుక్రవారం తులసిరెడ్డి కార్యాలయం వద్దకు చేరుకున్న దివ్యాంగులు ఎల్లయ్య, కిరణ్‌కుమార్, జహీరుద్దీన్, ఖాదర్‌బాషా, యూసుఫ్, నబీరసూల్, జమాల్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ తాతిరెడ్డి తులసిరెడ్డి అన్నీ తానై అన్ని వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి మండుటెండలను కూడా లెక్కచేయకుండా ప్రచారాలలో అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు.


తాతిరెడ్డి తులసిరెడ్డిని సన్మానిస్తున్న మస్తాన్‌వలి

# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడండి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** సర్వజన వైద్యశాలలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైద్యశాల ఛాంబర్‌లో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, ఆసుపత్రి ఎలక్ట్రీషియన్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను రూ.4లక్షలతో సర్వీసింగ్ చేయించడం జరిగిందన్నారు. వర్షకాలం కావడంతో ఆసుపత్రిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్న కారణంగా ఎలక్ట్రికల్ సిబ్బంది నైట్ డ్యూటీలో ఉండేలా సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో విద్యుత్‌కు సంబంధించి అప్రమత్తంగా ఉండి, ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే అటెండ్ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేశ్వరరావు, వెంకటరమణ, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు

**బనగానపల్లెమేజర్,న్యూస్:** శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా శాంతి భద్రతలను కాపాడాలని బనగానపల్లె శ్రీ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తరువాత అక్కడక్కడ అల్లర్లను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలను చేపట్టడం జరిగిందని పట్టణంలో అల్లర్లు దాడులు , ప్రతిదాడులు వంటివి చేయ కూడదని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు.

### కర్నూలులో ఘనంగా

# ఫస్ట్ ఎయిర్‌బస్ రెస్టారెంట్ ప్రారంభం

### : ఇండియాలో నాల్గవ వినూత్న హెూటల్

**కర్నూలురూరల్, మేజర్‌న్యూస్:** కర్నూలు నగర శివారు ప్రాంతం, దుపాడు వద్ద శుక్రవారం కర్నూలు ఫస్ట్ ఎయిర్ బస్ రెస్టారెంట్ ప్రారంభమైంది. కార్యక్రమానికి ప్రముఖ వ్యాపార వేత్త, మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్, కోడుమూరు వైసీపీ సమన్వయ కర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి,కె. వి.సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కె.వి.సుబ్బారెడ్డి, ఇర్షాద్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. కె.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ దాదాపు ఆరు ఎకరాల సువిశాలమైన ఆహ్లాద కరమైన వాతావరణంలో, పిల్లలు ఆటలాడు కోవడానికి ప్రత్యేక సదుపాయాలతో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ కర్నూలు ఎయిర్ బస్ ఫ్లైట్ రెస్టారెంట్ చూడడానికి సమీపంలోని పలు ప్రాంతాల ప్రజలు సందర్శించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రధమంగా కర్నూలు యువకులు స్థాపించిన కర్నూలు ఫస్ట్ ఎయిర్ బస్ రెస్టారెంట్ వినూత్నంగా





ఉందన్నారు. అధునాతన సదుపాయాలతో ప్రజలందరికీ రుచికరమైన వంటకాలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. కావున ప్రజలందరూ ఈ ఫ్లైట్ ఎయిర్ బస్సు రెస్టారెంట్ ను సందర్శించి వంటకాలనీ రుచి చూడాలని ఆయన కోరారు. మధ్యతరగతి ప్రజలకు కూడా అందుబాటు ధరలతో ఎయిర్ బస్ రెస్టారెంట్ సేవలు అందిస్తుందని తెలిపారు. రెస్టారెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 11 ప్రాజెక్టులు నేడు నిర్వహణ జరుగుతున్నట్లు తెలిపారు. ఇండియాలో నాలుగు ప్రాంతాల్లో ఇలాంటి రెస్టారెంట్లు ఓపెన్ చేయడం జరిగిందన్నారు. వాటిలో ఢిల్లీలో రెండు, లుథియానాలో ఒకటి, కర్నూలులో ఒకటి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వ్యవస్థాపకులు హాఫీజ్, రసీద్, షేక్షవలి, మహేష్, రాజు, రఘు, అలితాఫ్, సలీంల ఆధ్వర్యంలో రెస్టారెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

### మూడోసారి పీఎంగా నరేంద్రమోడీ ఎన్నికతో

## బీజేపీ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో రాష్ట్రంలోను, కేంద్రంలోను ఎన్‌డీఏ కూటమి విజయదుందుభిని మోగించి మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో బీజేపీ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. శుక్రవారం జరిగిన ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు కశెట్టి కృష్ణమూర్తి, స్వామిరెడ్డి, బాలముని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు స్వాతి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, అరుణ , ఉపేంద్రరెడ్డి, లక్ష్మీరెడ్డి, రమేష్‌బాబు, ఈశ్వర్, సాయి, నాగమద్దిలేటి, మోహన్‌రెడ్డి, రామ్‌సుబ్బారెడ్డి, గురుబ్రహ్మం, మధు, భరత్, శ్రీనాథ్, సుబ్బారావు, మల్లేశ్వర్‌గౌడ్, నాగేంద్రబాబు, ప్రశాంత్, కేదార్‌నాథ్, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### వైసీపీ నాయకులు, కార్యకర్తలు

## ఎవరు అధైర్యపడొద్దు : ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**మంత్రాలయంరూరల్, మేజర్‌న్యూస్ :** మంత్రాలయం నియోజకవర్గంలోని వైఎస్సార్సిపి నాయకులు, కార్యకర్తలు ఎవరు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గతంలో ఎన్నో పోరాటాలు చేశామని, ఇప్పుడు కూడ అదే తరహాలో నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండి ముందుకు వెళ్లాలన్నారు. నాతోపాటు మా అన్న సీతారామిరెడ్డి, కుమారులు ప్రదీప్‌రెడ్డి, ధరణీధర్‌రెడ్డి, మండలాల గ్రామ సర్పంచులు, ఎంపిటీసీలు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.

### ఎమ్మెల్యే ఎన్‌ఎండీ ఫరూక్ విజయం

## ప్రజలకు అంకితం



మాట్లాడుతున్న ఎన్‌ఎండీ ఫిరోజ్

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్:** నంద్యాల ఎమ్మెల్యేగా ఎన్‌ఎండీ ఫరూక్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన నంద్యాల నియోజకవర్గ ప్రజలకు, అభిమానులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు ప్రతిఒక్కరికి పేరుపేరున నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ ధన్యవాదములు తెలుపుతూ ఈ విజయం ప్రజలు అంకితమన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం నందు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎన్‌ఎండీ ఫిరోజ్, జనసేన నాయకులు పిడతల సుధాకర్, పబ్బతి రవి ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల ప్రజలు ఇంతటి విజయాన్ని అందించినందుకు ఎంతో రుణపడి ఉంటామని ప్రజల కష్టాలను తీర్చేందుకు అనుక్షణం పనిచేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు సమస్యలను కూడా పరిష్కరిస్తామని అదే విధంగా పవన్ కళ్యాణ్‌ను గెలిపించిన పిఠాపురం ప్రజలకు నంద్యాల జనసేన పార్టీ తరుపున ఎమ్మెల్యే ఎన్‌ఎండీ ఫరూక్‌కు పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరికి ధన్యవాదములు తెలిపారు.

## ప్రతి హామీని నెరవేరుస్తాం : మాండ్ర, జయసూర్య



కొలనుభారతిని సందర్శించుకున్న మాండ్ర దంపతులు జయసూర్య

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్:** ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు తెలిపారు. శుక్రవారం మండలంలోని సంగమేశ్వరం, కొలనుభారతి పుణ్యక్షేత్రాలను సందర్శించారు. ఆలయ పురోహితులు పూర్ణ కుంభంతో మాండ్ర శివానంద రెడ్డి దంపతులకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు స్వాగతం పలికారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఎన్నికలలో గెలుపొందిన జయసూర్యకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి, గిత్తా జయసూర్యలు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు సాగునీరు, త్రాగునీరు అందిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ప్రతి పథకాన్ని నిరుపేదలకు అందిస్తామన్నారు. వైకాపాలోలాగా అరాచకపాలన ఉండదని అభివృద్ధి పాలన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారపురెడ్డి, జడ్.వెంకట్‌రెడ్డి, లింగస్వామి గౌడ్, శివారెడ్డి, పలుసాని మహేశ్వర రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, జానకిరాముడు, సుధాకర్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేయడమే టీడీపీ లక్ష్యం

### – మాజీ జడ్పీ ఛైర్మెన్ బత్తిన వెంకటరాముడు



బత్తిన వెంకటరాముడుకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ఘనవిజయం సాధించడంతో వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రామలింగయ్యపల్లకు వచ్చి బత్తిన వెంకటరాముడను కలిసి ఆయనను శాలువా, పూలమాలలతో సన్మానించి కేక్ కట్ చేసి విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సంధ్భంగా బత్తిన వెంకటరాముడు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి చూసి రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు. ప్రస్తుతం పత్తికొండ ఎమ్మెల్యేగా కేఈ శ్యామ్‌కుమార్, ఎంపీగా బస్తిపాటి నాగరాజు విజయం సాధించడంతో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో పనిచేయడం వల్లే ప్రస్తుత విజయానికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిన దేవేంద్ర, బత్తిన కిరణ్, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటపతి పాల్గొన్నారు.

## నేతల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం మానుకోవాలి

### – కషాయం ధరించి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే మీరు
### – టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని నియోజకవర్గ ప్రజలు వైసీపీ ఎమ్మెల్యేను ఓడించినా తనకు ఇంకా బుద్ధి రాలేదని మాజీ టీడీపీ ఇంచార్జీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆదోని నియోజకవర్గంలో అధిక శాతంలో ఉన్న ముస్లీం మైనార్టీలు తమ వెంట ఉండి ఘోర ఓటమి చేసిన సాయిప్రసాద్‌రెడ్డికి తగిన బుద్ధి రాలేదంటూ ఆమె హెళన చేసింది. ఇక రానున్న రోజుల్లో మాజీ ఎమ్మెల్యే కషాయం ధరించి ప్రాంతాన్ని వదిలి వెళ్లాల్సిందేనన్నారు. ఎందుకంటే కూటమి నేతల మధ్య చిచ్చు పెట్టి పైశాచిక ఆనందాన్ని పొందాలని చూస్తున్న అతని కట్టుకథలు ప్రజలు ఎవరు నమ్మే పరిస్థితుల్లో లేదన్నారు. కూటమిలో ఉంటూ, సమిష్టంగా కృషి చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ పార్థసారధి నేతృత్వంలో నేతలందరూ కలిసి పనిచేస్తూ, అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండి అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న గొప్పలుకంటే మినహా అభివృద్ధిని ఆదోని నియోజకవర్గంలో చేసి బడుగు, బలహీన పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రజలు, పట్టణ ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇలాంటివి మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని చెప్పకనే చెప్పారు. నియోజకవర్గ ప్రజలు కూటమి నేతలను నమ్మి పట్టం కట్టారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి ఏంటో మరో 10ఏళ్లు తలచుకునేవిధంగా తాము చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గుడిసె శ్రీనివాసులు, రాంభీం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# కణితుల కల్లోలం

## – నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే
## – కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్.సుమంత్‌కుమార్


డాక్టర్ సుమంత్‌కుమార్

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్:** మానవ శరీరం పనితీరు మొత్తం మెదడు మీదే ఆధారపడి పనిచేస్తుందని, మెదడులో ఏ మాత్రం తేడా వచ్చినా కల్లోలంగా మారుతుందని కర్నూలు కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్.సుమంత్‌కుమార్ అన్నారు. ప్రతి ఏడాది జూన్ 8వతేదీన వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్‌డేగా జరుపుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన హాస్పిటల్‌లో మాట్లాడారు. మెదడులో వచ్చే కణితులు చాలా ప్రమాదకరమన్నారు. ఈ సమస్య పట్ల జాగ్రత్తగా ఉండకపోతే చాలా ప్రమాదమన్నారు. కర్నూలు ప్రాంతంలో ఇటీవల కాలంలో మెదడు కణితులు ప్రమాదాలు నమోదు అవుతున్నాయన్నారు. మన కిమ్స్ హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాలతో మెదడులో వచ్చిన కణితులను తొలగించే వైద్యం అందుబాటులో ఉందన్నారు. రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ వంటి అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉందన్నారు. కణితులను త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే మంచిదన్నారు.

# ప్రధాని మోడీని కలిసిన కర్నూలు ఎంపీ నాగరాజు



**కర్నూలురూరల్, మేజర్‌న్యూస్:** దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయదుంధుభి మోగించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 9వతేదీన నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీని కర్నూలు ఎంపీ శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిశారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# టీడీపీ నాయకుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గౌరుచరితారెడ్డి ఎన్నికల్లో గెలుపొందడంతో శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 20వార్డు టెలికాం నగర్‌లో నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరీదేవి పల్లకీసేవ


అమ్మవారి పల్లకీసేవ దృశ్యం

**బనగానపల్లెరూరల్,న్యూస్:** మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయం నందు శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకీసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం పల్లకిలో కూర్చొబెట్టి ప్రధాన ఆలయం చుట్టూ పల్లకీ సేవను నిర్వహించారు. ఈ పల్లకీసేవలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

# సుపరిపాలన మోదీతోనే సాధ్యం

## – బిజెపి నాయకులు విట్టారమేష్


సంబరాలు నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

**ఆదోని, మేజర్‌న్యూస్ :** సుపరిపాలన ప్రధానమంత్రి మోదీతోనే సాధ్యమని బిజెపి నాయకులు విట్టా రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఈనెల 9వ తేదిన మోదీ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకొని నేతలు బిజెపి అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకొని స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, వికసిత భారత సంకల్పంగా ప్రధానమంత్రి దేశాన్ని అభివృద్ధి దిశగా పరుగులు ఎత్తిస్తున్నారన్నారు. రెండు పర్యాయాలు కరోనా విపత్తు సమయంలో దేశ ప్రజలను కాకుండా విదేశీయులను హక్కున చేర్చుకున్న ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని కొనియాడారు. ఆదోని అసెంబ్లీలో ఎన్డీయే కూటమి బలపరిచిన బిజెపి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి గెలుపొందడం ప్రజల గెలుపుకు ప్రతి రూపమన్నారు. ఈ కార్యక్రమంలో ఒబిసి మోర్చ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాసులు ఆచారి, మాలేకార్ శ్రీనివాసులు, అంజయ్, నాగార్జున, విజయ్ కృష్ణ, రమాకాంత్, జితేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల కుటుంబానికి అండగా ఉంటాం : బీసీ రాజారెడ్డి


బాధితులను పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడ్డ బాధితులకు అండగా ఉంటామని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నందవరం గ్రామంలో రెండు రోజుల క్రితం టీడీపీకి ఓట్లు వేస్తారా అంటూ కొందరు వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలైన పెద్ద భాస్కరయ్యగారి భాస్కర్, రవి, గోవిందులపై కర్రలు, రాడ్లు, క్రికెట్ బ్యాట్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ కార్యకర్తలు ముగ్గురు తీవ్రంగా గాయపడి బనగానపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి నందవరం గ్రామ టీడీపీ నాయకులు పి.వి కుమార్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, లక్ష్మి రెడ్డిలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

## అవుకులో కనువిందు చేస్తున్న

# జలపాతాలు


కనువిందు చేస్తున్న జలపాతం

**అవుకు, మేజర్‌న్యూస్ :** గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. కొండమీది గ్రామాలలో కురుస్తున్న భారీ వర్షాల వలన వంకలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జలపాతాల ద్వారా అవుకు జలాశయంలోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ వర్షాల వలన పొలాలు పదునెక్కి వ్యవసాయానికి అనువుగా ఉంటుందని రైతులు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా పెసర, మినుము, శనగ, కంది పంటలకు తొలకరి చినుకుల వలన పంటలు సాగు చేసుకోవడానికి దుక్కి దున్నుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతుల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అవుకు జలాశయంలోనికి వస్తున్న జలపాతం పలువురిని విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ వర్షం వలన పాడి పరిశ్రమ రైతులకు, పశువులకు త్రాగునీరు సమకూరుతుందని రైతులు పేర్కొన్నారు.

## యాగంటి క్షేత్రానికి పాదయాత్ర చేసి మొక్కు తీర్చుకున్న

# ఎర్రగుడి సర్పంచ్ దంపతులు


పాదయాత్రగా బయలుదేరిన సర్పంచ్ వరలక్ష్మి

**బనగానపల్లెరూరల్, న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్ రెడ్డి గెలిస్తే పాదయాత్ర చేస్తానన్న మొక్కును ఎర్రగుడి గ్రామ సర్పంచ్ దోనపాటి వరలక్ష్మి వారి భర్త దోనపాటి భాస్కర్ రెడ్డిలు శుక్రవారంనాడు యాగంటి క్షేత్రానికి పాదయాత్ర చేసి వారి మొక్కును తీర్చుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయాన్ని సాధించడంతోపాటు బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. అందుకుగాను యాగంటిలో మొక్కు తీర్చుకున్న వరలక్ష్మి దంపతులు మాట్లాడుతూ ఎర్రగుడి గ్రామం నుండి పాదయాత్రగా వచ్చి ఉమామహేశ్వరులకు మొక్కు తీర్చుకున్నామని త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో బనగానపల్లె ఎమ్మెల్యేకు మంత్రిగా అవకాశం రావాలని వారు స్వామి వారిని పూజించడం జరిగింది.


గౌరు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

## గౌరు దంపతులను కలిసిన

# టీడీపీ నాయకులు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన గౌరు చరితారెడ్డిని శుక్రవారం పలువురు టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు పార్లమెంటు టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణుడు, బీసీ విభాగం టీడీపీ నాయకులు రాముడు, లీగల్ సెల్ నాయకులు చంద్రశేఖర్, మహేష్‌గౌడ్, విజయలక్ష్మి, అయ్యత్‌బీ, రాజశేఖర్, సురేష్‌గౌడ్, సురేఖ, మాధవి, నరసింహనాయుడు గౌరు దంపతులను కలిసి. శాలువ, పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సత్రం రామక్రిష్ణుడును గౌరు దంపతులను పరామర్శించారు.

## ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని

# కలిసిన క్రీడా సంఘం ప్రతినిధులు


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన గౌరు చరితారెడ్డిని శుక్రవారం ఏపీపీఈటీ, ఎస్ఏపీ అసోసియేషన్ కర్నూలు జిల్లా ప్రెసిడెంట్, జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ జోసెఫ్ లక్ష్మయ్యతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిశారు. శాలువా, పూలబొకే సన్మానించారు. వ్యాయామ విద్య కోసం సహాయ, సహకారాలు అందించాలని కోరగా, తమ వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటరాముడు, బాషా, శ్రీనివాసులు, సిరాజ్, రత్నారెడ్డి, క్రిష్ణమూర్తి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, స్వామన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.

**మొదటి పోస్టల్ బ్యాలెట్ ఓటరుకు చరితమ్మ సన్మానం:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్‌లో మొట్టమొదటగా ఉదయం 6 గంటలకే పోలింగ్ బూత్‌కు చేరుకొని మొట్టమొదటి ఓటును వినియోగించుకున్న మిలటరీ కాలనీకి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు గంతి క్రిష్ణమూర్తిని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అభినందించారు. తన విజయంలో వివిధ వర్గాలతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. వారి సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానని, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

సూర్య

శనివారం | 08 | జూన్ 2024

# 2వ వార్డులో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

**ఎమ్మెల్యే బీవీ ఆదేశాలతో త్రాగునీటి సమస్యకు పరిష్కారం**



వార్డులో పర్యటిస్తున్న కమిషనర్

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎన్నికల ప్రచారంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని 2వ వార్డు ప్రజలు తాజా ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన 48గంటలలోనే తాగునీటి సమస్య పరిష్కారం చూపుతానని ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే బీవీ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆ వార్డులో పర్యటించారు. 2వ వార్డు టీడీపీ ఇంచార్జి తురేగల్ నజీర్ అహ్మద్ తో కలిసి మరమ్మత్తులకు గురైన వాటర్ సిస్టం ట్యాంకులను, డ్రైనేజీలను పరిశీలించారు. సంబంధిత పనులను వెంటనే పూర్తిచేయాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు. అనంతరం తురేగల్ నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ.. తాగునీటి పైపు లైన్ లు మరమ్మత్తులకు గురి కావడంతో తమ వార్డులో తాగునీటి కష్టాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే బీవీ సహకారంతో అధికారులు సమస్యకు పరిష్కారం చూపడం సంతోషకరమన్నారు. కమిషనర్ వెంట డి ఈ మనోహర్ రెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

# 15న జిల్లా స్థాయి విలువిద్య ఎంపిక పోటీలు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 15వతేదీన జిల్లా స్థాయి విలువిద్య ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి కె.నాగరత్నమయ్య తెలిపారు. అండర్ 10, 13, 15విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 22, 23వతేలల్లో విజయవాడలోని శాతవాహన డిగ్రీ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి విలువిద్య పోటీఓల్ల పాల్గొంటారని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9393855460, 9032104158 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# 7,8 తరగతుల కొరకు దరఖాస్తు చేసుకోండి



ప్రిన్సిపల్ శైలజ

**గడివేముల, మేజర్‌న్యూస్ :** ఆదర్శ పాఠశాలలో ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు మిగిలిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శైలజ అన్నారు. గడివేములలోని మోడల్ స్కూల్ నందు ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు మిగిలిన పిల్లలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం నాడు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని ఆసక్తి గల విద్యార్థిని విద్యార్థులు బీసీ స్టడీ సర్టిఫికెట్‌తో పాటు తల్లి తండ్రి ఆధార్ కార్డులు, రెండు పాస్‌పోట్ సైజ్ ఫోటోలతో పాఠశాలలో అందజేయాలని ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయిస్తామని ప్రతకికా ప్రకటనలో తెలిపారు.

### శనివారం నాడు దుర్గా భోగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**గడివేముల, మేజర్‌న్యూస్ :** గడిగరేవుల గ్రామంలో స్వయంభువై వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ స్వామి వారి జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం ప్రతి నెలా వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున రుద్రహోమం మరియు శ్రీ స్వామి వారికి రుద్రాభిషే కం కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై 11 గంటలక వరకు లోకకళ్యాణం కొరకు జరపాలని నిర్ణయించడమైనది. కావునా ఈ కార్యక్రమంలో పాల్గొను భక్తులు ముందుగా సంప్రదించగలరు. హవన కార్యక్రమాన్ని చేసినా, చూసినా శివానుగ్రహం, ఆయురారోగ్యములు కలుగునని తెలుపుతూ ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి వారి కృపకు పాత్రులవ్వాలని కార్యనిర్వహణాధికారి రామానుజన్ తెలిపారు.

### ఆళ్లగడ్డ ఆర్య వైశ్య సంఘం నూతన అధ్యక్షునిగా దేవి శెట్టి హరీష్ బాబు



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :**

ఆళ్లగడ్డ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షునిగా దేవిశెట్టి హరీష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిన్నటి వరకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఉన్న తొమ్మండ్రు వినోద్ కుమార్ పదవీకాలం ముగియడంతో దేవిశెట్టి హరీష్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాసవి యువజన సంఘం అధ్యక్షులు గుండా రవికుమార్ పలువురు ఆయనను అభినందించారు.

# వృద్ధురాలి మెడలో నుంచి మూడు తులాల బంగారు చైను అపహరణ

**కర్నూల్ క్రైమ్ మేజర్ న్యూస్ :**

నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో నివాసం ఉంటున్న వృద్ధురాలు లక్ష్మీదేవి వాకింగ్ చేస్తుండగా చైన్ స్నాచర్ మెడలోఉన్న చైన్ లాక్కొని వెళ్లిన సంఘటన నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నంద్యాల చెక్ పోస్ట్ వద్ద ఉన్న నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో పార్క్ వద్ద శుక్రవారం లక్ష్మీదేవి 70 సంవత్సరాలు సాయంత్రం 6 గంటల సమయంలో వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని యువకుడు వెనుక వైపు నుంచి వచ్చి మెడలోంచి లాక్కెళ్లాడు. వెంటనే చేరుకొని తేరుకొని అరుపులు కేకలు వేసిన ఫలితం లేకుండా పోయింది. మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైన్ లాక్కెళ్ళడంతో తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంకట సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# భారీ వర్షం.. రోడ్డెక్కి పారుతున్న నీరు

**– ఇబ్బందుల్లో వాహనదారులు – కరివేన వద్ద కెజి రోడ్డుపై వర్షపునీరు – ట్రాఫిక్‌కు అంతరాయం**



**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** మండల పరిధిలో భారీ వర్షాలు కురవడంతో వర్షపు నీరు కోజి రోడ్డుపై ఎక్కి పారడంతో ట్రాఫిక్‌కు సంతరాయం కలిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భగ భగ మండే సూర్యడి తాపానికి ప్రజలు విల విలలాడుతుంటే వరుణుడు కరుణించడంతో ఎండ వేడిమి, ఉక్కపోత నుంచి ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. శుక్రవారం తెల్లవారు జామున మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. దీంతో మండల పరిధిలోని కరివేన గ్రామం డిపాల్ పాఠశాల సమీపంలో కర్నూలు–గుంటూరు రోడ్డుపై వర్షపు నీరు పొంగిపొర్లడంతో పాటు సమీప కాలనీ జలమయ్యాయి. వాహనాలు అటు ఇటు దాటేందుకు వీలు లేనంతగా పొంగిపొర్లడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. చుట్టుపక్కల పొలాల్లోని వర్షపు నీరంతా కెజి రోడ్డుపై ఉన్న కల్వర్టు కింద నుంచి కరివేన గ్రామం చెరువులోకి చేరుతుంది. అయితే కల్వర్లు కింద నీరు మొద్దులు, కంపచెట్లు, చెత్తాచెదారం అడ్డం పడడంతో నీరు ఎటుపోలేక కెజి రోడ్డును ఎక్కిపారింది. దీంతో మధ్యాహ్నం వరకు వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామ సర్పంచ్, నాయకుల చొరవతో అడ్డుగా ఉన్న మొద్దులు, కంపచెట్లను, చెత్తను తొలగించడంతోట్రాఫిక్ అంతరాయ సమస్య తీరింది.

# వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలు

**గడివేముల, మేజర్‌న్యూస్ :** గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను ఏప్రిల్ 29 నుండి జూన్ 7 వరకు గ్రంథాలయ అధికారి వి. వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు 40 రోజులు నిర్వహించడం జరిగిందనీ, ఈ వేసవి శిక్షణలో భాగంగా పిల్లలకు కథల పుస్తకాలు చదివించడం మరియు చెస్, పాము ఆట, క్యారమ్స్‌బోర్డు మొదలగు ఆటలను నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థిని విద్యార్థులు మనోవికాసం కోసం పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు కావలసిన పుస్తకాలు చదువుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అలాగే హైస్కూల్ టీచర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ విరామ సమయంలో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి అని సూచించారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న ప్రతి విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందజేశారు.



గ్రంథాలయం ముందు విద్యార్థుల దృశ్యం

# రాతనలో సుంకులమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంలో శుక్రవారం టీడీపీ మహిళా అధ్యక్షురాలు రాతన ఈరమ్మ ఆధ్వర్యంలో సుంకులమ్మ దేవతకు 101 టెంకాయలు కొట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా టీడీపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌చౌదరి హాజరై మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఘనవిజయం అందించడంతోపాటు పత్తికొండ ఎమ్మెల్యేగా కేఈ శ్యామ్‌కుమార్‌ను గెలిపించారన్నారు. రాతన ఈరమ్మ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి సూపర్‌సిక్స్ పథకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తిరుపాల్‌నాయుడు, స్థానిక టీడీపీ నాయకులు క్రిష్ణమూర్తిచౌదరి, ఈరన్నస్వామి, జయసింహ, ఈశ్వరయ్య, మైరాముడు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సంఘాల నాయకులపై చర్యలు తీసుకోండి ..డీటీఎఫ్



ఫిర్యాదు చేసినట్లు చూపుతున్న సతీష్ కుమార్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్:** ఉపాధ్యాయ సంఘాలపై చర్యలు తీసుకోవాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె.సతీష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు ఎన్‌టీయూ, ఏపీటీఎఫ్ 1938, ఏపీటీఎఫ్ 257 టీఆర్‌టీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు,సాంబశివుడు, శివయ్య, క్రిష్ణారావు, వెంకటేశ్వర రెడ్డి, మౌలాలి, శ్రీనివాసులు, ఆనంద్ బాబు, రామకృష్ణయ్య, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాఠశాలలో విధులు నిర్వహించకుండా ఓడీలుగా మార్చుకుంటూ ఉపాధ్యాయ బదిలీలలో మోసాలకు పాల్పడుతూ ఉపాధ్యాయ శాఖను మోసం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ పేరుతో అడ్రస్‌లేని ఫిర్యాదుపై తనను అక్రమంగా సస్పెండ్ చేసి ఉద్యోగం నుండి తొలగించడం జరిగిందని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డీఈఓ విచారణ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తక్షణమే వీరందరి పూర్తి సర్వీసుపై పాఠశాల రికార్డుల ఆధారంగా ఆర్‌జేడీ ఆదేశాల మేరకు బహిరంగ విచారణ చేపట్టాలని డీఈఓకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

## నారాలోకేష్‌ను కలిసిన ఉమాపతి నాయుడు



**ఆదోని, మేజర్ న్యూస్:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు కలిశారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం పట్ల నారాలోకేష్‌కు అభినందనలు తెలిపారు. నారాలోకేష్ ఆదోని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

## ఎమ్మెల్యేను కలిసిన డిఎస్పీ

**పత్తికొండటౌన్,మేజర్‌న్యూస్ :** పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబును శుక్రవారం పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు స్వగృహం వద్ద డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సిఐలు మురళీమోహన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్.ఐలు గోపాల్, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బందిని ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు పనిచేయాలని సూచించారు. డిపార్టుమెంట్‌కు తన సహకారం ఎప్పుడు ఉంటుందని, ప్రజాజీవనానికి ఇబ్బందులు కలిగించే అసాంఘీక కార్యకలాపాలపై గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఎన్ఎండి. ఫరూక్‌ను ఘనంగా సత్కరించిన నంద్యాల ఐఎంఏ



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** నంద్యాల ఎంఎల్ఏ గా ఘన విజయం సాధించినఎన్ఎండి ఫరూక్‌ను ఐఎంఏ నంద్యాల సభ్యులు శాలువా, గజమాల,జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈకార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ గుర్రాల రవి కృష్ణ, తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ వైద్యుల విభాగం అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, నంద్యాల జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ సాయి కృష్ణ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, డాక్టర్ ఖలీల్ సొహెల్,డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శరత్ కుమార్, డాక్టర్ భార్గవర్ధన రెడ్డి, డాక్టర్ నీలా ప్రసాద్, డాక్టర్ గెలివి సిద్ధార్థ, డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మదా, డాక్టర్ షబ్నం, డాక్టర్ హరిత, డాక్టర్ శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల వైద్యులు మంచి నైపుణ్యంతో వైద్యా న్ని అందిస్తున్నారని, సేవాభావం కలిగి ఉన్నారని అభినందించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ వైద్య సమావేశాల కోసం, ఆరోగ్య శిబిరాల నిర్వహణ కోసం భవనాన్ని కట్టడానికి స్థలం కేటాయించమని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఫరూక్ స్పందిస్తూ అధికారుల తో చర్చించి స్థలం కేటాయించడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజా తీర్పును శిరసావహిస్తాం

**ఓటమి కారణాలపై విశ్లేషిస్తాం**

**మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల నాని**



**విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తామని మాజీ శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డిఅన్నారు. శుక్రవారంవైకాపా కార్యాలయం లో మాజీ ఎమ్మెల్యే గంగుల నానితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లో అభివృద్ధికి దోహదపడతామన్నారు. 86 వేల పై చిలుక ఓట్లు మాకు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అన్ని కార్యక్రమాలలో పాలుపంచుకుంటామని కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. వాస్తవాలను రాయాలని ఆయన ఈ సందర్భంగా విలేకరులకు సూచించారు. ప్రజా నిర్ణయం మేరకు నడుచుకుంటా మన్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల నాని మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. 2024 ఎన్నికల్లో నాకు మద్దతుగా నిలిచిన ప్రజలకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతు న్నామన్నారు. ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తామన్నారు. నూతన ప్రభుత్వానికి అభివృద్ధిలో సహకరిస్తామన్నారు. ఎటువంటి సమస్య లు వచ్చినా కార్యకర్తలు సమన్వయంతో తమ దృష్టికి ముందుగా తీసుకుని రావాలని, చట్టబద్ధంగా వెళ్లాలని ఆయన సూచించారు. రానున్న కాలంలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, వైకాపా నాయకులు మాదం చెన్నయ్య, కులూరు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుష్పసినిమా తరహాలో అక్రమ మద్యం వ్యాపారం

**-అక్రమ మద్యం స్వాధీనం**

**-30 జాన్సన్ ఓరిజినల్ చాయిస్ బాక్స్‌లు స్వాధీనం**



**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** పుష్పసినిమా తరహాలో మండలంలో అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్న వారి వద్ద నుండి అక్రమ మద్యం బాక్సులను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గోనెగండ్ల, గంజహళ్లి గ్రామాల మధ్య ఎల్లెల్సీ కాలువ దగ్గర శుక్రవారం అక్రమ మద్యంను తీసుకొని బొలెరో వాహనంలో వెలుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు కాపుకాచి వాహనంను పట్టుకున్నారు. అయితే వాహనం లో ఉన్న పెద్దమరివీడు గ్రామానికి చెందిన మిన్నల్ల, పులకుర్తి గ్రామానికి చెందిన షేక్షావలి అక్రమ మద్యంను వాహనం ను వదలి పారిపోయారు. దీంతో పోలీసులు బోలేరో వాహనంను (టీఎస్-15-యూబీ-0913) అందులో ఉన్న 30 జాన్స న్ ఓరిజినల్ చాయిస్ బాక్సను(2,280 టెట్రాపాకెట్లను) పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పారిపోయిన ఇద్దరి పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. గూడ్స్ వాహనంలో వెనుక వైపు ఇతరులకు ఎవ్వరికి మద్యం బాక్సు కనపడకుండా ప్రత్యేక ర్యాక్ ను తయారు చేసి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తెలుగుదేశం పార్టీతోనే నాయీబ్రాహ్మణుల అభివృద్ధి



సన్మానిస్తున్న దృశ్యం

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీతోనే నాయీబ్రాహ్మణులఅభివృద్ధి జరుగుతుందని నాయీ బ్రాహ్మణ సవితా సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాస్ర్ట కార్యనిర్వాహక కార్యదర్శి పాలకవీటి విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి అభ్యర్థుల కోసం రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులు ఎంతో కృషి చేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విజయ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, ప్రభాకర్, రంగన్న, సురేష్, రాఘవేందు, సోమేష్, వీరేష్, పాల్గొన్నారు.

# 30శాతం సబ్సిడీతో కంది విత్తనాలు

**గడివేముల, మేజర్‌న్యూస్ :** కంది ఎల్ఆర్‌జీ-51 అండ్ ఎల్ఆర్‌జి-105 రకాల విత్తనాలు30 శాతం సబ్సిడీతో ఆర్.బి.కేల యందు అందుబాటులో ఉన్నాయనీ మండల వ్యవసాయ అధికారి హేమసుందర్‌రెడ్డి తెలిపారు. ఒక కేజీ ధర 140 రూపాయలు, సబ్సిడీ 42 రూపాయలు రైతు కట్టవలసినది 98 రూపాయలు, పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని ఆర్‌బికే సిబ్బందిని సంప్రదించి వేలిముద్ర వేసి ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా మండల వ్యవసాయాధికారి తెలియజేశారు.

# ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం లైబ్రేరియన్ అరుణకుమారి శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏప్రిల్ 29 నుండి ప్రారంభమయ్యే జూన్ 6వ తేదీ వరకు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పుస్తకపఠణం, క్విజ్, స్పోకెన్ ఇంగ్లీష్, స్పోర్ట్స్ గేమ్స్ లతోపాటు సామాజిక బాధ్యత ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి చిత్రలేఖనం, తదితర పోటీలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈరోజు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా రిటైర్డ్ జడ్జి కాశీభట్ల శివప్రసాదరావు విద్యార్థులకు అలాగే గ్రంథాలయ అధికారి అరుణకుమారికి ప్రత్యేకంగా అభినందించారు తల్లిదండ్రుల గొప్పతనాన్ని సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటేపాటించవలసిన పద్ధతులను వారికి వివరించారు. అలాగే పట్టణంలోని ప్రముఖ చర్మవ్యాధి నిపునులు డాక్టర్ ఏవి.సుబ్రహ్మణ్యం, ప్రముఖ న్యాయవాది ప్యానల్ అడ్వకేట్ షాహినా బేగం, సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ మౌలాలిలు ప్రత్యేక అతిథులుగా పాల్గొని విద్యార్థులకుగ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులతో పాటు ముఖ్య అతిథులకు ప్రత్యేక అతిధులకుసన్మానకార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఉద్యోగ అవకాశాలపై అవగాహన

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాబివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో 15 రోజులపాటు 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిప్రతాపరెడ్డికోర్సు యొక్క ప్రాముఖ్యత మరియు ఉద్యోగాల అవకాశాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథరెడ్డి, దేశ్ పాండే ఫౌండేషన్ మేనేజర్ ఉమాదేవి మరియు ఏపీ ఎస్ఎస్డిసి సిబ్బంది పాల్గొన్నారు.



**విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం**

# ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** చాగలమర్రి మండల పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి వీరభద్రుడు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చాగలమర్రి ఎంపీపీకార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి పంచి పెట్టారుఈ సందర్భంగా పలువురు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానం చేసారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, వైసీపీ నాయకులుగిరి రాజా, సుబ్బయ్య, అంకాల్‌రెడ్డి, శ్రీను,ఆనంద్ (వెంకటపతి),రవి,పెద్ద మల్లన్న, ఆశీర్వాదం, చిన్న వీరయ్య, రంగయ్య, మెడికల్ స్టోర్ తొమ్మాండ్రు నాగేంద్ర కుమార్ గుప్తా ,చుండూరు వెంకటరమణ వైయస్సార్సీపి రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఆవుల ప్రతాప్, హరి, తదితరులు పాల్గొన్నారు.



**సన్మానిస్తున్న అభిమానులు**

# మల్లెల మెడికల్ దుకాణం ప్రారంభం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు పట్టణంలోని సోగనూరు రోడ్డులో మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు, మల్లెల సునీలా ఆల్ ఫ్రెడ్ ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మల్లెల ఔషధ దుకాణాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్సీ చర్చి సంఘం కాపరి రవితేజ, డాక్టర్ శేఖర్, జమాతే ఇస్లాం హింద్ టౌన్ ప్రసిడెంట్ చాంద్ బాషా, మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, గణేష్ లతోపాటు తదితరులు పాల్గొని వారి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో మల్లెల గ్రూప్ తరపున మెడికల్ దుకాణాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. డోర్ డెలివరీ ఔషధ మందులను ఇంటి వద్దకు చేరే కార్యక్రమం చేయాలని వచ్చిన ఆలోచన కలగడం శుభ పరిణామం అన్నారు. మల్లెల ఆల్ఫ్రెట్ రాజు గత కొన్ని రోజులుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారన్నారు. అలాగే మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన వారికి శాల్వ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లెల గ్రూప్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.



సూర్య



### వైసీపీకి తొత్తుగా పనిచేసిన

# అధికారులపై వేటు తప్పదా..?

### – మున్సిపల్ అధికారుల్లో నెలకొన్న గుబులు



మున్సిపల్ కార్యాలయం

**ఆదోని, మేజర్‌న్యూస్ :** వైసీపీ ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేసిన కొందరి మున్సిపల్ అధికారులకు ప్రభుత్వం మారడంతో తమపై వేటు పడడం ఖాయమని కంటిమీద కునుకు లేకుండాపోయింది. వివరాల్లోకెళ్తే...పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో పని చేస్తున్న ఓ అధికారి కింద ఉన్న ఆర్పీలకు జరగనున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసేవిధంగా గ్రూపులకు ప్రాతినిధ్యం వహిస్తునన్ని ఆర్పీలు వారి పరిధిలోని గ్రూపు సభ్యులందరికి వైసీపీకి ఓటు వేసేవిధంగా ఆదేశించారని అధికారులు అజ్ఞాపించచడంతో ఆర్పీలు కూడ వారి పరిధిలో ఉన్న పొదుపు సంఘాల మహిళల వద్దకెళ్ళి సంక్షేమ పథకాలు ఇస్తున్న జగన్ ప్రభుత్వానికి ఓటేయాలని చెప్పి మరికొందరు ఆర్పీలు గ్రూపుల్లో ఉన్న మహిళలకు ఫోన్ చేసి వైసీపీకి ఓటు వేయకపోతే తమకు రావాల్సిన సంక్షేమ పథకాలతోపాటు గ్రూపులోని వడ్డీ మాఫీ, ఇతర పథకాలు రాకుండాపోతాయని బెధిరించిన వాయిస్ రీకార్డింగులు కాస్త అధికారంలోకి వచ్చిన నేతలకు అందినట్లు సమాచారం. దీంతో వారు అధికారుల ప్రక్షాళనకు సిద్దమైనట్లు తెలిసింది. అలాగే ఆదోని మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న మరి కొందరి అధికారులు వైకాపా ప్రభుత్వానికి దారదత్వంగా ఉండి పనులు చేసి పెట్టిన అధికారులపై వేటు వే సేందుకు ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం యోచన చేస్తున్నట్లు తెలిసింది. అధికారం మారిన కూడ కొందరి అధికారులు వైసీపీ ప్రభుత్వానికి మొగ్గు చూపి వాళ్ల ఫైళ్లను కదిలించే ప్రయత్నం చేస్తున్నట్లు అధికార పార్టీ నేతలు భావించినట్లు తెలిసింది. దీంతో అలాంటి అధికారులను ఏరివేసేందుకు అధికార పార్టీ నేతలు సన్నద్ధమవుతున్నట్లు తెలియడంతో కార్యాలయంలోని అధికారులు నిద్రించలేక తమను బదిలీ చేయించొద్దంటూ ... అధికారుల చుట్టు తిరుగుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మాత్రం వైసీపీకి వత్తాసు పలికిన అధికారులు మాత్రం ఊపేక్షించేది లేదని హుకుం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు అధికారులైతే తమ బదిలీని నిలిపేసుకునేందుకు అధికారంలోకి వచ్చిన నేతలను ఆశ్రయించి మంతనాలు కూడ జరుపుతున్నట్లు తెలిసింది. నేతలు వైసీపీ తొత్తులుగా పనిచేసిన అధికారులను బదిలీ చేసి వారి పంతాన్ని నెగ్గించుకుంటారా.... లేక వారితోనే పనిచేసుకుంటారానే సమాధానం కోసం వేచి చూడాల్సిందే....

# ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ



కలెక్టర్ శ్రీనివాసులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, శాంతియుతంగా, విజయవంతంగా ముగిసిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు నూతనంగా ఏర్పాటైన జిల్లా అయినప్పటికీ తగినంత సమర్థవంత సిబ్బంది కొరత ఉన్నప్పటికి గత అనుభవం లేకపోయినా సరే సార్వత్రిక ఎన్నికల పోలింగ్, లెక్కింపపు ప్రక్రియలను విజయవంతంగా ముగించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సజావు నిర్వహణకు సహకరించిన ప్రజలు, జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది, మీడియా మిత్రులు, ఎన్నికల పరిశీలకులు, ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు తదితరులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి మాసం నుంచి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16వ తేదీ నుంచి జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖల అధికారుల సహాయ సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదన్నారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్య పండుగను జిల్లాలో ఎంతో విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఎటువంటి విమర్శలకు ఆస్కారం లేకుండా ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించ డం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం కృషి చేసిందని తెలిపారు. అలాగే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## నారా లోకేష్‌ను కలిసిన టిజి భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే టి.జి భరత్ కలిశారు. విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాయలసీమలో కూటమి భారీ విజయం సాధించడంపై లోకేష్ తో చర్చించినట్లు టిజి భరత్ చెప్పారు. కర్నూల్ నియోజకవర్గంలో 25 ఏళ్ల తర్వాత తెలుగుదేశం పార్టీ గెలవడంపై నారా లోకేష్ సంతోషం వ్యక్తం చేసినట్లు టి.జి భరత్ తెలిపారు.

### జీజీహెచ్‌లో

## ఈ–డిజిటల్ ఓపీ కౌంటర్ ప్రారంభం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శుక్రవారం ఈ–డిజిటల్ ఓపీ కౌంటర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతిరోజూ దాదాపు 3వేలమంది ఔట్ పేషెంట్లు వస్తున్నారని, వారి కోసం నూతనంగా మరో ఓపీ కౌంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ–డిజిటల్ కౌంటర్‌లో స్కానర్ స్కాన్ చేస్తే ఓపీ జనరేట్ అవుతుందన్నారు. దీని వల్ల క్యూలైన్‌లో ఎక్కువసేపు ఉండాల్సిన పరిస్థితి ఉండదన్నారు. త్వరలో మరె రెండు ఓపీ కౌంటర్లు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, డాక్టర్లు వెంకటేశ్వరరావు, పద్మవిజయశ్రీ, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ వెంకటరమణ, శివబాలనగాంజన్, కిరణ్‌కుమార్, సునిల్‌ప్రశాంత్ పాల్గొన్నారు.



నూతన ఓపీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం



జలకళతో ఆర్డియస్ ఆనకట్ట

# ఆర్డియస్‌కు జలకళ

### – రైతుల కళ్ళల్లో ఆనందం

**కోసిగి, మేజర్‌న్యూస్:** గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల తుంగభద్రనదిలో నీరు ప్రవహిస్తుంది. దీనితో ఆర్డియస్‌కు జలకళతో కళకళలాడుతుంది. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలలో పెద్దెత్తున వర్షాలు కురవడంతో అటు నదినీళ్ళు, ఇటు వరదనీళ్ళు ప్రవహించి తుంగభద్రనది ప్రవహిస్తుంది. పూర్తిగా ఎండిపోయిన నదికి నీరు ప్రవహించడంతో రైతుల కళ్ళల్లో ఆనందం నింపుకుంది. పంటసాగుకు రైతులు సిద్దంచేసుకుంటున్నారు.

## ఎమ్మెల్యే టి.జి భరత్ కటౌట్‌కు పాలాభిషేకం



**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** కర్నూలు ఎమ్మెల్యేగా టి.జి భరత్ ఘనవిజయం సాధించడంతో తెలుగుదేశం పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద 50 అడుగుల టిజి భరత్ కటౌట్ ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. సీనియర్ నాయకులు బొల్లెద్దుల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళ నాయకురాళ్లు అందరూ పాల్గొని బాణాసంచా పేల్చి అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే టిజి భరత్ నాయకత్వంలో కర్నూల్ నగరం రానున్న రోజుల్లో ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

## మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** మహిళల సమస్యల పరిష్కారానికి పాణ్యం నియోజవర్గం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి కృషి చేయాలని అంతర్జాతీయ మానవహక్కుల కమిషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనీస పాషా కోరారు. అఖండ మెజారిటీతో విజయం సాదించిన ఎమ్మెల్యే గౌరు చరితమ్మ గౌరు వెంకట్ రెడ్డిలను శు క్రవారం అనీస పాషా కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గౌరు చరితమ్మతో మాట్లాడుతూ మహిళా సమస్యలు మరియు ప్రజా సమస్యల పై పోరాడుతున్న తనకు నియోజకవర్గ పరిధిలో ప్రజలకు న్యాయం జరిగేలా చూడడంలో అవసరమైనప్పుడు ఎమ్మెల్యేగా తనకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి కేక్ కట్ చేయించారు.

### పసందైన రుచులకు కేరాఫ్..

## మండి@9R అరేబియాన్ రెస్టారెంట్

### – ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేష్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీజీ వెంకటేష్

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పసందైన రుచులకు కేరాఫ్.. మండి@9R అరేబియాన్ రెస్టారెంట్ అని ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పాత కంట్రోల్ రూమ్ సమీపంలో శుక్రవారం యజమాని రవిబాబు ఆధ్వర్యంలో మండి@9R అరేబియాన్ రెస్టారెంట్ 2వ బ్రాంచ్‌ను టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండి@9R అరేబియాన్ రెస్టారెంట్‌లో ప్రజలకు, నాన్ విజిటేరియన్ ప్రియులకు విందు సంతృప్తి కలిగిస్తుందన్నారు. కర్నూలు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పవన్, నంద్యాల మేనేజర్ శేఖర్, రెస్టారెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

